## సాయిబాబా ఫైనాన్స్‌పై చర్యలు తీసుకోవాలి

• మాజీ ఎంపీ వీహెచ్.హనుమంతురావు

సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్ హనుమంతురావు

నాగర్‌కర్నూల్, జూలై 13 : అధిక వడ్డీ ఆశచూపి మోసం చేసిన వ్యాపారి సాయిబాబా ఫైనాన్స్‌పై రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం సమన్వయంగా పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతురావు డిమాండ్ చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీని కలిసి సాయిబాబా ఫైనాన్స్ మోసాలపై వివరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వందలాది మంది నుంచి అధిక వడ్డీ ఆశ చూపుతూ వందల కోట్ల రూపాయలు వసూలు చేశారని, ఆ డబ్బులను ఏబినామీపై వ్యాపారాలు చేశారో పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన అనేక మంది భూనిర్వాసితులు ప్రభుత్వం ద్వారా అందిన పరిహారం మొత్తాన్ని అతని వద్ద ఉంచి అతడు చేసిన మోసానికి ఏం చేయాలో అర్థం కాలేని పరిస్థితుల్లో రైతులు ఉన్నారని, అతని బంధువుల ఆస్తులపై కూడా నిఘా ఉంచి దోపిడీ నియంత్రించాలని కోరారు. కేంద్ర మంత్రి అమిత్‌షా కాంగ్రెస్‌పై బురద జల్లుతున్నారని, ఎమర్జెన్సీ తర్వాత అనేక పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం జరిగిందని తెలిపారు. సమావేశంలో నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, పాపిరెడ్డి, నాయకులు, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు లేక మూతబడిన ప్రభుత్వ పాఠశాలలు

• అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం
• పట్టించుకోని అధికారులు • ఆందళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైన రంగంపేట పాఠశాల ఆవరణ

ఉప్పునుంతల, జూలై 13 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం మారుమూల తండాలు, శివారు గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అభివృద్ధికి ప్రత్యేక కృషి చేసింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తండాలను, శివారు గ్రామాలను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నం చేస్తుందని పలు గ్రామాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంసానిపల్లి తండా, రంగంపేట, సీబీ తండా, గుట్టమీది తండాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూతబడ్డాయి. విద్యార్థులు లేరన్న కారణంతో విద్యాధికారులు మూసివేసినట్లు ఆరోపిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విద్యాబుద్ధులు నేర్పిన బడులు నేడు.. విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. అలాంటి పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన పాఠశాలలను నేడు అర్థంతరంగా మూసివేయడం ఎంతవరకు సమంజసమని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. నాడు ప్రవేశపెట్టిన 'మన ఊరు-మన బడి' కార్యక్రమంతో సర్కారు బడుల రూపురేఖలు మారగా.. నేడు వాటి బాగోగులను పట్టించుకోవాల్సిన రేవంత్ సర్కారు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా పాఠశాలలు లేకపోవడంతో పక్క గ్రామాలు, లేదా ప్రైవేటు స్కూళ్లకు వెళ్లాల్సిన దుస్థితి తలెత్తిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించడంతోపాటు, స్థానికంగానే విద్యార్థులను సమకూర్చి చేర్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..**

ఈ విద్యా సంవత్సరం నాలుగు పాఠశాలలను అర్థాంతరంగా మూసివేయడంతో భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మండలంలోని రంగంపేట పాఠశాలను తాగుబోతులు జల్సాలకు ఉపయోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్కడ అడపా దడపా బీరు బాటిళ్లు, గ్లాసులు దర్శనమిస్తుండడంతో స్థానికులు విస్తుపోతున్నారు. ఈ విషయంపై ఎంఈవో రామారావును వివరణ కోర గా విద్యార్థులు లేకపోవడంతో బడులను మూసివేశామని చెప్పారు. గ్రామీణ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు.

## చంద్రయ్య కుటుంబానికి అండగా ఉంటా..

• గోళి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, జూలై 13 : మండల పరిధిలోని చెర్కూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన గౌడుగు చంద్రయ్య కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోళి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం చెర్కూర్ గ్రామంలో చంద్రయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించాడు. చంద్రయ్య ముగ్గురు కూతుర్లతో మాట్లాడి వారిపై చదువులకు కావాల్సిన సహకారం అందిస్తానని భరోసా కల్పించారు. రూ.10 వేలు నగదు ఆర్థిక సాయమందించారు. కార్యక్రమంలో నాయకులు బీమయ్యగౌడ్, మైసయ్య, శ్రీను, బీమరాజు, లాలయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుభాష్ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రిక అందజేత

వంగూరు, జూలై 13 : మండలంలోని పొల్కంపల్లిలో ఈనెల 28వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమ ఆహ్వాన పత్రికను శనివారం హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజులకు రజక సంఘం నేతలు అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు, రజక సంఘం జిల్లా నేత సురేందర్ మాట్లాడుతూ తెలంగాణ పోరాటంలో అలుపెరుగని పోరాటం చేసిన ఐలమ్మ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానించిన వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గువ్వలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం నేతలు గోపాల్, కాశీనాథం, రవీందర్, శేఖర్, పరశురాములు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గువ్వలకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న నాయకులు

## గుండాల ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ జూలై 13 : గుండాల అంబరామలింగేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. శనివారం నూతనంగా నియమింపబడ్డ ఆలయ పాలక మండలి ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై చైర్మన్, సభ్యులను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, మాజీఈ జెడ్పీవైస్ చైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు భూపతిరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, పర్వత్‌రెడ్డి ఉన్నారు.

## 20న ఉచిత కార్డియాలజీ క్యాంపు

• ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

ఉద్యోగ విరమణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటరూరల్, జూలై 13 : ఈనెల 20వ తేదీన పట్టణంలోని వంద పడకల సర్కారు దవాఖానలో ఉచితంగా కార్డియాలజీ క్యాంపును నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ శనివారం తెలిపారు. దవాఖానను సందర్శించి రోగులకు అందుతున్న వైద్యం తీరును అడిగితెలుసు కున్నారు. ప్రధానంగా నరాలు, గుండె, ఎముకలకు సంబందించి అన్ని ఆపరేషన్లు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. గుండెకు సంబంధించి ఈసీజీ ద్వారా రోగ నిర్ధరణ జరిగితే మెరుగైన వైద్యం అందించాల్సి వస్తే ఆరోగ్య శ్రీ, స్టంట్ వేయడం ఇతర శస్త్ర చికిత్సలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు. సీబీఎం ట్రస్టు చైర్మన్ జెడ్పీటీసీ, డాక్టర్ అనురాధ, కేర్ ఆసుపత్రి సౌజన్యంలో కార్డియాలజీ క్యాంపును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 20న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆపరేషన్లు జరుగుతాయని తెలిపారు.

**అంకిత భావంతో పని చేస్తే గుర్తింపు**

లింగాల, జూలై 13 : ఎలాంటి ఉద్యోగమైన అంకితభావంతో పని చేస్తే మంచి గుర్తింపు వస్తుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రానికి చెందిన కాత్రావత్ రాజు ఉపాధ్యాయ ఉద్యోగ రీత్యా ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శనివారం అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించగా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఖమ్మం జిల్లా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇరువురి ఎమ్మెల్యేలు రాజునాయక్ దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా సన్మాన కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేలను రాజునాయక్ వారి కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నేజమ్మ, మాజీ ఎంపీపీ లింగమ్మ, జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్, నాయకులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

• సీఐ నాగార్జున

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సై

ఊర్కొండ, జూలై 13 : మండలంలోని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్సై వీరబాబు అన్నారు. మండలంలోని ఊర్కొండపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ ఎస్పీ రఘునాథ్ వైభవ్ గైక్వాడ్ ఆదేశానుసారం ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని సమాజంలో జరుగుతున్న నేరాలు, సైబర్ క్రైం, డ్రగ్స్, దొంగతనాలు వంటివి నేరాలను తగ్గించడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దానికి గ్రామ ప్రజలు, నాయకులు అందరూ సహకరించి గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

ఈత మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్తులు

బిజినేపల్లి, జూలై 13 : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎక్సైజ్ సీఐ కళ్యాణ్ అన్నారు. శనివారం మండలంలోని కారుకొండ గ్రామంతో పాటు కేఎల్ఐ కాల్వ పొడవునా ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల ఉపాధి కోసం ఈ మొక్కలు నాటుకోవాలని సూచించారు. మొక్కలను నాటి సంరక్షిస్తే మంచి ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు సతీశ్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, నగేశ్, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతయ్యగౌడ్, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఎక్సైజ్ దాడులు

• నలుగురిపై కేసునమోదు

లింగాల, జూలై 13 : మండలంలోని రాయవరం గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో శనివారం సారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్కపల్లి ఎక్సైజ్ శాఖ సీఐ రమణయ్య మాట్లాడుతూ జిల్లా ఎక్సైజ్, ప్రోహిబుషన్ అధికారిణి గాయత్రి ఆదేశాల మేరకు సారా స్థావరాలపై దాడులు నిర్వహిస్తుండగా వ్యవసాయ పొలంలో తూఫాన్ వాహనం అక్కడే ఉన్నట్లు గమనించి వాహనంలో ఉన్న వ్యక్తులను విచారించగా కర్నాటక రాష్ట్రం నుంచి బెల్లం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. 150లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి వాహనంలో ఉన్న 1500కిలోల నల్లబెల్లం, 40 కిలోల పటికతోపాటు 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని పెద్దకొత్తపల్లి మండలంలోని ముక్కిడిగుండెం గ్రామానికి చెందిన అశన్నపల్లి రాంబాబు, బిజినేపల్లి భాస్కర్, మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన వడ్త్యి శ్రీను, కర్నాటక రాష్ట్రం గురిమిట్కల్‌కు చెందిన హన్మంతునాయక్‌లపై కేసున మోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై జనార్దన్, సిబ్బంది గోపాల్‌రెడ్డి, కృష్ణ, నాగార్జున, రాము పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

పెద్దకొత్తపల్లి, జూలై 13: మండలంలోని దేవునితిర్మలాపూర్ సమీపంలో రేషన్ బియ్యం పట్టుకున్న ఘటన చోటు చేసుకున్నది. కోడేరు మండల కేంద్రానికి చెందిన పొడేండ్ల రవి చంద్రకల్ గ్రామం నుంచి ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసుకొని బొలెరో వాహనంలో వెళుతుండగా పట్టుకున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రామ్మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుకున్న ఎనిమిది క్వింటాళ్ల బియ్యాన్ని స్థానిక డీలర్ వద్ద ఉంచినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి తెలిపారు.

## ఆయిల్‌పాం సాగు లాభాదాయకం

లింగాల, జూలై 13 : అయిల్‌పాం సాగు రైతుకు దిగుబడితోపాటు అధిక లాభాలు సాధించవచ్చని మండల వ్యవసాయధికారి నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం అయిల్ పాం పంటను ఏవిధంగా సాగు చేయాలనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిల్‌పాం సాగు ఒక సారి వేసుకుంటే నాలుగు సంవత్సరాల తర్వాత పంట చేతికి వస్తుందన్నారు. తక్కువ పెట్టుబడితో స్థిరమైన ఆదాయం వస్తుందని తెలిపారు. యేడాదికి 7 నుంచి 8 నెల ల వరకు కాపుకాస్తునే ఉంటుందని పేర్కొన్నారు. ఒక మొక్క రూ.193 ఉండగా ప్రభుత్వం రూ.20లకే సబ్సిడీపై రైతులకు సరఫరా చేస్తుందని, అదేవిధంగా డ్రిప్ ఇరిగేషన్ ద్వారా చిన్న సన్నకారు రైతులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీ ఉంటుందని పంటల నిర్వహణకు ఎకరాకు రూ.4,200 అందించడంతోపాటు నాలుగుకు కలిపి రూ.16,800 ప్రభుత్వం ప్రోత్సహకంగా ఇస్తుందన్నారు. అసక్తి గల రైతులు తమ పేర్లను ఉద్యాన శాఖ కార్యాలయంలో నమోదు చేయించుకుంటే మొక్కలను అందజేస్తున్నట్లు ఏవో తెలిపారు.

## గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోవాలి

కల్వకుర్తి రూరల్, జూలై 13 : కల్వకుర్తి పట్టణ, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన అర్హులైన వారు గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కల్వకుర్తి ట్రాన్స్‌కో శ్రీను శనివారం కోరారు. కల్వకుర్తి మున్సిపాలిటీలో నివసించే వారు మున్సిపాలిటీ కార్యాలయంలో, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వారు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు విద్యుత్ బిల్లు, ఆధార్, ప్రజాపాలన దరఖాస్తుతో గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## శనైశ్చరుడికి తిలతైలాభిషేకాలు

బిజినేపల్లి, జూలై 13 : మండలంలోని వడ్డెమాన్‌లో శనైశ్చరస్వామికి శనివారం భక్తులు తిలతైలాభిషేకం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకొని నువ్వుల నూనె, జిల్లేడుపూలు, నల్లటి వస్త్రాలు ధరించి ప్రత్యేక పూజలు చేసి దోషాలను తొలగించాలని వేడుకున్నారు. అనంతరం నందీశ్వరాలయంలో శివలింగానికి రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు విశ్వనాథశాస్త్రి, శాంతాకుమార్, ఉమామహేశ్వర్, ఆలయ చైర్మన్ గోపాల్‌రావు, చంద్రయ్య, వెంకటేశ్, గోపాలచారి, భక్తులు ఉన్నారు.

## చెంచులను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

• సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

చెంచుల సమస్యలపై అధ్యాయనం చేస్తున్న శ్రీనివాస్

కొల్లాపూర్, జూలై 13 : కాంగ్రెస్ ప్రభుత్వం చెంచుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. శనివారం కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి మండలాల పరిధిలోని చెంచు పెంటల్లో సీపీఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చెంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యాయనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెంచు పెంటలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. చెంచులకు ఇచ్చిన భూములు అన్యాక్రాంతం అయినట్లు తెలిపారు. చెంచుల చేతిలో సాగు భూములు లేవన్నారు. కొంతమంది పెత్తందార్లు చెంచులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. చెంచు పెంటల్లో తమ అధ్యాయనంలో చెంచుల జీవన స్థితి దుర్భరంగా ఉందన్నారు. రక్తహీనతో, విష జ్వరాలతో చాలా మంది చెంచులు మంచం పట్టారని పేర్కొన్నారు. వందలాది మంది చెంచులకు రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు లేవని, చాలా మందికి పింఛన్లు కూడా రావడం లేదని చెప్పారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి చెంచు పెంటల్లో ప్రత్యేక వైద్య శిబిరాలతోపాటు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. చెంచుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరిని కొనసాగిస్తే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం అధ్యక్షుడు కిరణ్, ఇతర ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

బిజినేపల్లి, జూలై 13: మండలంలోని వడ్డేమాన్ గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో గ్రామంలోని రహదారి కూడలి వద్ద శనివారం ధర్నా చేశారు. ఈసందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న మాట్లాడుతూ గ్రామంలోగల ప్రభుత్వభూమి ఆక్రమించి అలుగును తొలగించి ఊటకుంట చుట్టూ ఫెన్సింగ్‌చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి చొరవ తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో వీరస్వామి, శ్రీనివాస్, సుదర్శన్, రత్నయ్య, శేఖర్, రాములు, రమేశ్, బంగారయ్య, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

## కొనసాగుతున్న క్రీడోత్సవాలు

ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

కల్వకుర్తి, జూలై 13 : కల్వకుర్తి పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భాగంగా రెండోరోజు శనివారం లీగ్ దశ పోటీలు ముగిశాయి. మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం, నిజామాబాద్ జట్లు సెమిఫైనల్స్‌కు చేరుకున్నాయి. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి భాను కిరణ్, సభ్యులు నాగేశ్, గజానంద్, కిశోర్, రాజేందర్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ఊర్కొండ, జూలై 13 : మనస్తాపానికి గురైఓ వ్యక్తి పురుగుల మందు తాగి మృతి చెందిన ఘటన మండలంలోని రాచాలపల్లిలో చోటుచేసుకున్నది. ఎస్సై వీరబాబు కథనం మేరకు గ్రామానికి పున్యమూర్తి మల్లయ్య(49) కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య నిలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కళాశాల బృందానికి అభినందనలు

బిజినేపల్లి, జూలై 13 : మండలంలోని పాలెం గ్రామంలో గల శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇటీవల స్వయం ప్రాతిపత్తి లభించిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విద్యారాణిని, అధ్యాపక బృందాన్ని రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ దేవసేవా అభినందించారు. అనంతరం విద్యాకమిషన్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థినీలకోసం హాస్టల్ భవనం నిర్మాణంకోసం రూ.5.35 కోట్లు మంజూరు చేయాలని నివేదికను కమిషనర్‌కు అందజేశారు. అనంతరం జాయింట్ డైరెక్టర్ యాదగిరి, రాజేంద్రసింగ్‌లను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కృష్ణయ్య, నాగరాజు, శివ, యాదగిరి, మనోజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## ఊరటనిచ్చిన వర్షం

ఎరువుల కోసం ఆగ్రోరైతు సేవా కేంద్రం వద్ద రైతుల సందడి

ఉప్పునుంతల, జూలై 13 : శుక్రవారం అర్ధరాత్రి కురిసిన కొద్ది పాటి వర్షం రైతులకు కొంత ఊరట కల్పించింది. ఉప్పునుంతల, మర్రిపల్లి, సదగోడు తదితర గ్రామాల్లో రైతులు నెల రోజుల కిందట పడిన వర్షానికి పత్తి పంట వేశారు. పత్తి విత్తనాలు విత్తిన తర్వాత వర్షం ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందారు. నీటి సౌకర్యం కల్గిన రైతులు స్పింకర్ల సాయంతో పత్తి మొక్కలకు నీరందించగా నీటి సౌకర్యం లేని రైతులు నిత్యం వర్షం కోసం ఎదురు చూశారు. శుక్రవారం రాత్రి మోస్తరుగా వర్షం పడడంతో పత్తి చేనుకు డీఏపీ (పిండి) వేయడానికి గానూ ఒక్కసారిగా శనివారం రైతులు ఎరువుల దుకాణాల వద్ద క్యూ కట్టారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలు రైతులతో కిటకిటలాడాయి. ఆలస్యంగా నైనా కొద్ది పాటి వర్షం పడడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేశారు.

## 'ఉపాధి కల్పనే లక్ష్యం'

వెల్దండ, జూలై 13 : విద్యా, వైద్యం, ఉపాధి కల్పనే ఐక్యత ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐక్యత కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం గోడ పత్రికలను ఆయన విడుదల చేశారు. ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు ఐక్యత ఫౌండేషన్, శంకరానేత్రాలయ చెన్నై వారి సంయుక్త ఆధ్వర్యంలో వెల్దండలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 3వేల మందికి కంటి చికిత్సలు, మందులు, అద్దాలు పంపిణీ, మొబైల్ అపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. చెన్నై శంకరానేత్రాలయానికి 12,500 డాలర్లు డొనేషన్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐక్యత ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్ రెడ్డి సభ్యులు ఉన్నారు.

## లారీ బోల్తా

తిమ్మాజిపేట, జూలై 13 : తిమ్మాజిపేట మండల గుమ్మకొండ సమీపంలో శుక్రవారం రాత్రి ఓ లారీ బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు అల్యూమినియం రాడ్‌లతో వెళ్తున్న లారీ గుమ్మకొండ దాటిన తర్వాత కోడుపర్తి మిట్ట సమీపంలో బోల్తా పడింది. వర్షంతో రోడ్డు చిత్తడిగ మారడంతో లారీ అదుపు తప్పి బోల్తా పడినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడినట్లు ఎస్సై తెలిపారు.

## పశుగ్రాస విత్తనాలు పంపిణీ

అమ్రాబాద్, జూలై 13 : అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లోని రైతులకు పశువుల పశుగ్రాసం కోసం విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఉమ్మడి మండలాల పశువైద్యాధికారి అనీల్ శనివారం తెలిపారు. రాబోయే రోజుల్లో పాడి రైతులకు పశువుల పశుగ్రాసం కోసం కొరత రాకుండా ఉండటానికి పశుగ్రాస విత్తనాలు సీఎస్‌హెచ్ 24 ఎంఎఫ్ ఫొడ్డర్‌జావర్ రకం విత్తనాలను 75శాతం సబ్సిడీ కింద ఉమ్మడి ప్రాథమిక పశువైద్య కేంద్రాల్లో పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఘనంగా మొహర్రం వేడుకలు

అచ్చంపేట టౌన్ : చావిడిలో కొలువుదీరిన పీర్లు

చారకొండ : జూపల్లిలో ప్రతిష్ఠించిన పీర్లు

తాడూరు, జూలై 13 : మండలంలోని వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాల్లోని పీర్ల చావిడీ వద్ద పీర్లను ప్రతిష్ఠించారు. రాత్రి వేళల్లో అలావ్ ఆడుతూ పాడారు. మండలంలోని తాడూరు, సిర్సవాడ, ఐతోల్, ఇంద్రకల్, భలాన్‌పల్లి, అంతారం, గోవిందాయిపల్లి, నాగుదేవ్‌పల్లి, మేడిపూర్ గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్నారు.

**చారకొండలో..**

చారకొండ, జూలై 13: మండల పరిధిలోని జూపల్లిలో మొహర్రం పురస్కరించుకొని శనివారం పీర్ల చావిడి వద్ద అలంకరించించి ప్రత్యేక ప్రార్థనలు చేసి పీర్లను ఏర్పాటు చేశారు. వేడుకల సందర్భంగా 14న చిన్న సరిగేత్తు, 16న పెద్ద సరిగెత్తు తదితర కార్యక్రమాలు వారం రోజుల పాటు నిర్వహించనున్నారు.

**అచ్చంపేటలో..**

అచ్చంపేట టౌన్, జూలై 13 : మొహర్రం పండుగ సందర్భంగా అచ్చంపేట పట్టణంలోని చావడీలో పీర్లు కొలువుదీరాయి. ఈ సందర్భంగా శనివారం పట్టణ ప్రజలు పీర్ల చావడీల వద్దకు వెళ్లి కొబ్బరి, బెల్లంతో పీర్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదు

చారకొండ, జూలై 13: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రసీదబేగం, పద్మావతి, నిర్మల అన్నారు. మండల కేంద్రంలో మొదటి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా పని చేసిన కళావతమ్మ శనివారం ఉద్యోగవిరమణ పొందారు. ఈ సందర్భంగా కళావతమ్మ దంపతులను అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సన్మానించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

TOURS & TRAVELS



★ మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578. NT-339536

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794